క్లుప్తంగా

రామాలయ నూతన కమిటీ

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని శ్రీరామాలయ దేవస్థాన నూతన కమిటీని శుకవారం ఎన్నుకున్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోలం అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా బండారి భిక్షపతి, ఉపాధ్యక్షులుగా తెట్టె సుగుణాకర్ ఎన్నికయ్యారు. ఈ కమిటీ కాలపరిమితి రెండేళ్లు. ఈనెల 17న జరిగే శ్రీరామనవమి వేడుకలు ఈ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్..?

కాజీపేట అర్బన్ : మండలంలోని న్యూశాయంపేటకు చెందిన బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ శనివారం కాంగ్రెస్‌లో చేరనున్నట్లు న్యూ శాయంపేటలో చర్చించుకుంటున్నారు. హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పశ్చిమ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే సమక్షంలో మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు సమాచారం. ఈయన చేరితే బీఆర్ఎస్ పూర్తిగా న్యూశాయంపేటలో ఖాళీ కానుంది.

ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: భూ కబ్జాకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ పి.మల్లయ్య తెలిపారు. దేశాయిపేట రోడ్డులోని టీచర్‌కాలనీకి చెందిన ఇక్బాల్ వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లోని 277 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇటీవల వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన కొల్లన రవి, ఎండీ జలాల్, బొంత శేఖర్ కలిసి ఇక్బాల్ ఇంటిస్థలాన్ని కబ్జా చేశారు. మంత్రి సురేఖ ఆదేశాల ప్రకారం బాధితుడు ఇక్బాల్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తెల్లచామంతులతో అమ్మవారికి అలంకరణ

హన్మకొండ అర్బన్ : శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది ఉత్సవాల సందర్భంగా పుష్పయాగంలో భాగంగా శుక్రవారం నాల్గో రోజు పద్మాక్షి అమ్మవారిని 21 కిలోల తెల్లచామంతులతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు.

ప్రజల కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటా..

కాజీపేట: ప్రజలకు అను నిత్యం అందుబాటులో ఉంటూ కష్టాసుఖాల్లో భాగస్వామ్యం పంచుకునే మీ బిడ్డ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి ఎంపీగా గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులకు కాషాయం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం మాట్లాడుతూ అరూరి గెలుపు కోసం కార్యకర్తలు శ్రమించి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రవి, శిరీష్‌కుమార్, ఫణీంద్ర, నరేంద్ర పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడిగా దిలీప్ కుమార్



హన్మకొండ: మాదిగ హక్కుల దండోరా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా సింగారపు దిలీప్ కుమార్‌ను నియమించినట్లు దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ మాదిగ తెలిపారు. మాదిగ హక్కుల దండోరా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గం రంగంపేటకు చెందిన దిలీప్ కుమార్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. తనను ఈ పదవిలో నియమించిన ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, నాయకులు కిశోర్, భాస్కర్, చరణ్ మాదిగకు దిలీప్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఉర్సు



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ షామీర్‌పూర్‌లో హజ్రత్ హాజీ కలందర్ దర్గా అధ్యక్షుడు మహ్మద్ మాషూక్ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం సాయంత్రం ఉర్సు దర్గా పీఠాధిపతి నవీద్‌బాబా హాజరై మహ్మద్ మాషూక్‌తో కలిసి కలందర్ దర్గాను దర్శించుకున్నారు. అనంతరం ఊరేగింపుతో దర్గాకు చేరిన జెండాకు నవీద్‌బాబా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు యా కూబ్, సులేమాన్, అక్బర్, ఖాజాపాషా, గౌస్ ,తాజ్‌పాషా, సలీమ్ పాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భూకబ్జా ప్రకంపనలు!

- వరంగల్ తూర్పులో మరోసారి తెరపైకి..
- పార్టీ అంతర్గత సమావేశంలో 'కొండా' వ్యాఖ్యలు
- అలాంటి వాటి జోలికి వెళ్లొద్దంటూ సున్నితంగా మందలింపు
- హాట్‌టాపిక్‌గా మాజీ ఎమ్మెల్సీ మురళి వ్యాఖ్యలు
- హస్తం పార్టీలో చేరిన కొంతమంది బీఆర్ఎస్ నేతల్లో కలవరం

సాక్షి, వరంగల్ : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో భూకబ్జాల లొల్లి మళ్లీ తెరమీదికొచ్చింది. ఇన్నాళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాగిన కబ్జాల పర్వమే.. కాంగ్రెస్ హయాంలోనూ కొనసాగుతుందన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ అప్రమత్తమైంది. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలతో శుక్రవారం జరిగిన సమావేశంలో సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఈ మేరకు కొందరు నేతలనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. మీరు భూకబ్జాల జోలికి వెళ్లొద్దు.. ఏమైనా ఉంటే పనులు చేసుకొని సంపాదించుకోవాలని ఓ కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్‌తోపాటు మరో ఇద్దరు సీనియర్ నాయకులకు ఆయన సుతిమెత్తగా చెప్పిన మాటలు పార్టీలోని ఇతర నేతలను కూడా ఆలోచింపజేస్తున్నాయి.



మంత్రికి ఫిర్యాదు చేసిన మరుసటి రోజే..

పేదలకు చెందిన భూములను ఆక్రమించుకున్నారని తన వద్దకు ఫిర్యాదులు రావొద్దని, 15 నుంచి 20 గజాల భూమి విషయాల్లో జోష్‌గా వెళ్తున్నారని, అలా వెళ్తే కత్తిరింపులు ఉంటాయని హెచ్చరించినట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరో రెండు రోజుల్లో నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని, ఇందుకు తగినవిధంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని చెప్పిన కొండా మురళి.. అదే సందర్భంలో పార్టీకి చెడ్డపేరు తెచ్చేవారికి అంతగా ప్రాధాన్యం ఉండదని చెప్పడం హాట్‌టాపిక్ గా మారింది. అయితే చింతల్‌లోని సర్వే నంబర్ 44లో 267 గజాల స్థలాన్ని కాంగ్రెస్ నేత ఒకరు కబ్జా చేశారని బాధితుడు ఇక్బాల్ మంత్రి కొండా సురేఖకు గురువారం ఫిర్యాదు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరుసటిరోజు శుక్రవారం పార్టీ అంతర్గత సమావేశంలో భూకబ్జాలపై మురళి సున్నితంగా మందలించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

జంప్ జిలానీల్లో వణుకు..

ఇప్పటికే వరంగల్ తూర్పులో కొండా సురేఖ గెలిచి మంత్రి అయిన తర్వాత ఈ నియోజకవర్గం నుంచి 13 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో వచ్చి చేరారు. ఆ తర్వాత కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు కూడా హస్తం కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కొందరు కార్పొరేటర్లపై అవినీతి ఆరోపణలతో పాటు భూకబ్జాలు చేసినట్లు ప్రచారం ఉంది. అయితే, కొండా మురళి తూర్పు ముఖ్యనాయకులతో తాజాగా జరిగిన సమావేశంలో భూకబ్జాలు చేస్తే సహించమంటూ...అలాంటి చిల్లర జోలికి వెళ్లొద్దంటూ వ్యాఖ్యలు చేయడంతో జంప్ జిలానీల్లో వణుకు మొదలైంది. అధికారం ఉన్న పార్టీలోకి వస్తే తమ పనులకు ఎలాంటి చిక్కు ఉండదని, కాంగ్రెస్ పార్టీకి వస్తే ఇక్కడా నిబంధనలు విధిస్తుండడంతో కొందరు నేతలకు మింగుడు పడడం లేదు. భూకబ్జాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నేతలు చేరారని, వీరిని పార్టీలోకి చేర్చుకోవద్దంటూ ఇప్పటికే కాంగ్రెస్ కార్యకర్తలు వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. తాజాగా భూకబ్జాలకు వెళ్లొద్దని కొండా మురళి చెప్పడంతో కాంగ్రెస్ వైఖరి ఏమిటన్నది వారికి చెప్పినట్లయ్యిందని శ్రేణులు సంతోషంలో ఉన్నాయి. దీంతో తూర్పులో కబ్జాల బెడద ఉండకపోవచ్చని, ఇది పార్టీకి ఎంతో లాభించే అంశమని కిందిస్థాయి కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. గతంలో భూకబ్జాలే బీఆర్ఎస్‌ను అప్రతిష్టపాలు చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

కరీమాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించి వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఉర్సు గుట్ట సమీపంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడడమే కాకుండా విదేశాల్లో ఉన్న నల్లధనం వెలికితీసి దేశంలోని పేదలందరికీ పంచిపెడతామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ వాటిని విస్మరించిందని విమర్శించారు. ప్రతీ ఏటా రెండున్నర కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినా ఇప్పటి వరకు కేవలం వేల సంఖ్యలో మాత్రమే భర్తీ చేసిందని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి చేయూతనివ్వాల్సిన ప్రభుత్వం కార్పొరేటీకరణ చేయడం కోసం మూడు రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనను



మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

వ్యతిరేకిస్తున్న ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ, సీబీఐ, ఇన్‌కంటాక్స్ శాఖల ద్వారా దాడులు చేయిస్తూ అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతుందని తెలిపారు. ఈసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఒక్కొక్కటిగా ప్రైవేటీకరణ చేస్తుందని చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు రత్నమాల, జిల్లా కార్యదర్శి రంగయ్య, నాయకులు బాబు, రామస్వామి, సమ్మయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

రాజకీయాలను వ్యాపారంగా మార్చేశారు

- ప్రజాసమస్యలు సృష్టిస్తున్న పార్టీలను తిరస్కరించాలి
- ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి



మాట్లాడుతున్న వల్లెపు ఉపేందర్‌రెడ్డి

వరంగల్ చౌరస్తా : రాజకీయాలంటే ప్రజలకు సేవ చేయడం మరిచి రాజకీయాలను వ్యాపారంగా మార్చివేశారని ఎంసీపీఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో జరిగిన ఎంసీపీఐ(యు), బీఎల్ఎఫ్ సంయుక్త వరంగల్ పార్లమెంటరీ స్థాయి సమావేశం పార్లమెంట్ కన్వీనర్ నర్ర ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. సమావేవానికి ముఖ్యఅతిథిగా ఉపేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి నిజాయితీ విలువలకు తిలోదకాలు ఇస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారే ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని గెలిచే ప్రయత్నం చేస్తూ గెలిచాక ఓట్లు వేసిన ప్రజలను దోచుకుతింటూ తరగని ఆస్తులను వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. నీతిగా నిజాయితీగా విలువల కోసం కట్టుబడి ఉన్న బీఎల్ఎఫ్ లాంటి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మాస్ సావిత్రి, కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంద రవి ,రాష్ట్ర కమిటీ సభ్యులు నీల రవీందర్, గడ్డం నాగార్జున, బీఎల్ఎఫ్ జిల్లా నాయకులు రాగసుధా, జగదీశ్వర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి ప్రధాని అయితేనే అభివృద్ధి

- లోకసభ ఎన్నికల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్

మడికొండ : మూడోసారి మోదీ ప్రధాని అయితేనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని లోకసభ ఎన్నికల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ అన్నారు. శుక్రవారం కాజీపేట మండలం మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగిన వరంగల్ పార్లమెంట్ బూత్ స్థాయి సభ్యుల విజయ సంకల్ప సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాని మోదీ పరిపాలనలో దేశం అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ బూత్ స్థాయిలో పటిష్టంగా ఉంటేనే పార్టీ పటిష్టంగా ఉంటుందన్నారు. ప్రతి బూత్‌లో పది మంది కార్యకర్తలు ఉంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మోదీ, జేపి నడ్డా, అమిత్‌షాల పిలుపు మేరకు బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనాలను నిర్వహించడం జరిగిందన్నారు. రాముడిని, రాజ్యాంగాన్ని పూజించి, గౌరవించే ఏకైక పార్టీ బీజేపి అని అన్నారు. ప్రతీ బూత్‌లో మహిళల భాగస్వామ్యం పెంచేవిధంగా చూడాలని సూచించారు. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ విషప్రచారం చేస్తున్నారని, అది అబద్ధం అని అన్నారు. వరంగల్ నుంచి అత్యధిక సార్లు మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా పని చేసిన కడియం శ్రీహరి అండర్ డ్రెయినేజీ తెస్తా అంటున్న శ్రీహరి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నీవల్ల క్లాస్-1 కాంట్రాక్టర్ కాలేదని, 1994 నుంచే కాంట్రాక్టర్‌గా స్వయం శక్తితో ఎదిగానని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, గండె విజయరామారావు, మార్తినేని ధర్మరావు, గరికపాటి మోహన్‌రావు, ము రళీధర్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, దశమంతరెడ్డి, నిషధర్ రెడ్డి, కొండేటి శ్రీధర్, బూత్ కమిటీ సభ్యులు వెంకట్‌రావు, మహేందర్, రాజు, వెంకటేష్, ధనుంజయ్, శివ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభయ్‌పాటిల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. స్టేషన్ రోడ్, ఖిలా వరంగల్, గొర్రెకుంట, పోతన, దేశాయిపేట, కేఎంసీ, మామునూర్, ఉర్సు, శంభునిపేట 33/11 కేవీ సబ్ స్టేషన్లు మరమ్మతుల కారణంగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలో...

హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలో సబ్‌స్టేషన్లు మరమ్మతు చేస్తున్నందున ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాలపూర్, యాదవనగర్, న్యూ శాయంపేట, కలెక్టరేట్, బాలసముద్రం, మచిలీబజార్, ఆర్ఈసీ, వడ్డెపల్లి, సోమిడి, మడికొండ, మడికొండ టెక్స్‌టైల్స్ పార్కు సబ్‌స్టేషన్‌ల ప్రాంతంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు దశలవారీగా నిలిపివేయనున్నట్లు ఎర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ క్యాంప్, భీమారం, రామారం, కోమటిపల్లి, కిట్స్ కాలేజీ, హసన్‌పర్తి, భద్రకాళినగర్, చింతగట్టు, ఎర్రగట్టు గుట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

హసన్‌పర్తి : ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని తహసీల్దార్ చల్లా ప్రసాద్ అన్నారు. మండలంలోని నాగారం, పెంబర్తి, వంగపహాడ్, సిద్ధాపురం, పెగడపల్లిల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగిన సలహాలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ తూకంలో ఎలాంటి లోటుపాటులో జరిగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్లు గోపాల్‌రెడ్డి, రాజేష్, ఏఓ అనురాధ, ఏపీఎం ప్రభాకర్ ఉన్నారు.



కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్

రేషన్ షాపు తనిఖీ

మండలంలోని పెగడపల్లిలోని రేషన్‌షాపును తహసీల్దార్ ప్రసాద్ తనిఖీ చేశారు. తూకంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు.

సిల్వియో పస్కాలి ఆశయ సాధనకు కృషి

కాజీపేట రూరల్ : దైవసేవకుడు ఫాదర్ సిల్వియో పస్కాలి పేదలకు చేసిన సేవలు కొనసాగిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు హైదరాబాద్ సిస్టర్ వి.జపమాల అన్నారు. ఫాతిమానగర్ దీవ్యదీప్తి భవన్‌లో శుక్రవారం ఫాదర్ సిల్వియో పస్కాలి 100వ వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జపమాల మాట్లాడుతూ ఫాదర్ సిల్వియో విద్య, వైద్య, సామాజిక రంగాలను ఏర్పాటు చేసి పేదల అభివృద్ధికి కృషి చేశారన్నారు. సీఎస్ఏ పునీత అనమ్మ సంస్థ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వితంతువులకు వస్తువుల పంపిణీ, అనాథ పిల్లలకు నగదు అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్స్ మార్గరెడ్డి మేరి, శౌరిలు, లత, స్వర్ణ, జ్యోతి, విజయ, తామసమ్మ, గ్యాబ్రియల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 13 సెంటర్ల సిస్టర్స్ పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న సిస్టర్ జపమాల

ఓటు హక్కు వినియోగించుకోవాలి

హన్మకొండ: ఓటర్‌గా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయన్నారు. తమ తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచాలన్నారు. 30 రోజుల పాటు ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఓటు వేయిస్తామని ప్రతిజ్ఞ పత్రం రాసి ఇచ్చారు. ఇందులో డ్రాతీసి విజేత, 10వ తరగతి విద్యార్థి చక్రధర్‌కు పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. సెయింట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గోపు జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉపాధ్యాయులు సుధారాణి, సుభాషిణి, జీసస్, తస్లీమ్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ పత్రాలు చూపుతున్న విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

రేపు డైరీ ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి ప్రాంతంలో ఉన్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల ప్రారంభంతో పాటు డైరీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కె.సంఘమయ్య తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న రైల్వే పెన్షనర్స్ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మార్కండేయను సన్మానించిన ఎమ్మెల్యే



కాజీపేట: పట్టణంలోని అల్ఫా ఓమేగా చర్చి ఆవరణలో శుక్రవారం క్రైస్తవ త్రినగరి సహవాసం నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బిషప్ జాన్ మార్కండేయను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, ఎంవి రాజు, పాస్టర్ కురియన ఐజాక్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కాజీపేట: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని 25 మంది నిరుపేదలకు శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. అనాథలుగా మారి రహదారుల పక్కన, దుకాణాల ఎదుట నిద్రిస్తున్న ఒంటరి వారిని గుర్తించి దుప్పట్లను క్లబ్ చార్టెడ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీ మల్లికార్జునరావు అందజేశారు.

ఆలయంలో కుంకుమార్చన పూజలు

కాజీపేట: పట్టణంలోని 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం మహిళలచే సామూహిక కుంకుమార్చన పూజలు జరిపించారు. శ్రీసీతారామ చంద్రస్వామి నవరాత్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమపూజ చేయించారు. భక్తులతో కలిసి అర్చకులు విష్ణు సహస్రనామ, సుందర కాండ పురాణ ప్రవచనం చేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి




వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లుగా నమోదైన వ్యక్తులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ సూచించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ భూముల వ్యవహారం గానీ, అసాంఘిక పనుల్లో గానీ రౌడీషీటర్లు తలదూర్చవద్దని, నిబంధనలు అతిక్రమించే శాఖపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో ఎవరిపైనా ఫిర్యాదు అందినా వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

విశ్వేశ్వరయ్యకు ఘననివాళి

హసన్‌పర్తి: భారతదేశ ఇంజనీర్, భారత రత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. చింతగట్టు క్యాంప్‌లో వర్ధంతి కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

కాజీపేటలో గంగోర్ ఉత్సవాలు



కాజీపేట: పట్టణంలో రాజస్థాన్ మహిళలు తమ భర్తలు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షిస్తూ గంగోర్ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమతమ ఇళ్లల్లో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవతమూర్తులు, ప్రత్యేక కుండీల్లో పెంచిన గడ్డి (కలాస్)లను నెత్తిన పెట్టుకుని పిల్లలు ఆడిపాడుతుండగా రహిమత్‌నగర్ నుంచి పట్టణంలోని శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాది తర్వాత మర్వాడీ మహిళలు జరుపుకునే ఈ ఉత్సవాలకు పట్టణంలో ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. మల్లన్న ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్ కుమార్ శర్మ మహిళలకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

మోటార్లకు మరమ్మతు

ఖిలా వరంగల్ : వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో చేతి, బోరు మోటార్లు పనిచేయటం లేదు. నీటికోసం స్థానికులు గోసపడుతున్నారు. దూర ప్రాంతాల బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్థానికులు కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి మహానగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సమాచారం అందజేశారు. శుక్రవారం శివనగర్‌కు బల్దియా సిబ్బంది చేరుకుని మూలకుపడిన మోటార్లకు మరమ్మతులు చేయించారు. వేసవి కాలం తాగునీటి సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్‌కు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు.

పెద్ద స్క్రీన్‌పై ఐపీఎల్ మ్యాచ్‌లు

నయీంనగర్: వరంగల్ క్రికెట్ ప్రేమికులు ఉచితంగా ఏప్రిల్ 13, 14 ఐపీఎల్ మ్యాచ్‌లు వీక్షించడానికి వరంగల్ సీకేఎం కళాశాల మైదానంలో పెద్ద స్క్రీన్‌పై లైవ్ యాక్షన్ వేదికను ఏర్పాటు చేశామని డబ్ల్యూడీసీఏ సెక్రటరి చాగంటి శ్రీనివాస్, అధ్యక్షుడు పి.ప్రవీణ్‌కుమార్ గౌడ్, బీసీసీఐ ప్రతినిధి అనంత్ శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం



బొడ్రాయి ప్రతిష్ఠలో హోమం చేస్తున్న అర్చకులు

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం ఉదయం 9.38 గంటలకు జరుగుతుందని కమిటీ తెలిపింది. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం హోమాలు, జలాధివాసం, శుక్రవారం అభిషేకాలు, కుంకుమార్చనలు, ధాన్యాధివాసం నిర్వహించారు. శనివారం మృగశిర నక్షత్రయుక్త, వృషభ లగ్న సుముహూర్తమున శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీనివాస వ్రతదర్ నారాయణ రామానుజ జీయర్‌స్వామిచే యంత్ర, విగ్రహ ప్రతిష్ఠలు, పూర్ణాహుతి, అన్నప్రసాదం, శ్రీభూలక్ష్మీభువనేశ్వరస్వామి, శాంతి కళ్యాణం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ కమిటీ సభ్యులు కేతిరి రాజశేఖర్, ముడుసు నర్సింహ, అంబాల సత్యం, మల్లయ్య, రహేలా, స్టాలిన్, కె.రాజు, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఓ వ్యక్తి హల్‌చల్

ఖిలా వరంగల్: వరంగల్-ఖమ్మం రహదారిపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఉర్సు కరీమాబాద్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు హాజరైన వ్యక్తులను కులంపేరుతో దూషించిన మహిళలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిపై పడుకుని ఓ వ్యక్తి నిరసన వ్యక్తం చేశాడు. దీనిపై స్థానికులు జోక్యం చేసుకోగా వెంటనే నిరసనను విరమించి కులం పేరుతో దూషించిన వ్యక్తులపై ఫిర్యాదు చేసేందుకు బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినట్లు తెలిసింది.



ఖమ్మం జాతీయ రహదారిపై పడుకుని నిరసన తెలుపుతున్న వ్యక్తి